# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని భారత దేశం విజయవంతంగా ప్రయోగించింది.**

2. **శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం రేపు పలు కీలక బిల్లులను ప్రవేశ పెట్టనున్నది.**

3. **దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలను విస్తరించే జి- శాట్ ఎన్ -2 ఉప గ్రహాన్ని భారత దేశం రేపు ప్రయోగించనుంది.**

4. **తిరుమల సందర్శించే భక్తులకు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది.**

5. **విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

భారత రక్షణ వ్యవస్థను పటిష్టం చేసే దిశగా దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్టు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ప్రకటించారు. మొదటి సారి జరిగిన ఈ పరీక్షతో దీర్ఘ శ్రేణి హైపర్ సోనిక్ క్షిపణులు కలిగిన దేశాలలో భారత దేశం కూడా చేరిందని ఆయన పేర్కొన్నారు. 15 వందల కిలోమీటర్ల దూరంలో వున్న లక్ష్యాలను కూడా ఈ క్షిపణి చేదించి ...., వివిధ రకాల వార్ హెడ్‌లను అమర్చేలా దీనిని రూపొందించడం మరొక ప్రత్యేకత అని రాజ్ నాథ్ సింగ్ వివరించారు. “ఒడిషా తీరంలోని డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం ఐలాండ్‌లో జరిగిన ఈ పరీక్ష .... భారత రక్షణ వ్యవస్థలో ఒక మైలు రాయి వంటిది” అని ఎక్స్‌లో రక్షణ శాఖ పేర్కొంది. పరీక్షకు సంబంధించిన వీడియోను కూడా రక్షణ శాఖ జత చేసింది. నిర్దేశిత లక్ష్యాన్ని ఈ క్షిపణి సునాయాసంగా చేదించిందని .... హైదరాబాదులోని డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం కాంప్లెక్స్‌లో ఈ క్షిపణి రూపొందిందని రక్షణ శాఖ వివరించింది.

--------------------------

శాసన సభలో రాష్ట్ర ప్రభుత్వం రేపు పలు ప్రధాన బిల్లులను ప్రవేశపెట్టనుంది. పంచాయతీ రాజ్ బిల్లును ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రవేశపెడతారు. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల నిరోధక బిల్లు ...., ఆంధ్రప్రదేశ్ కో- ఆపరేటివ్ సొసైటీ బిల్లు, మునిసిపల్ లా బిల్లు, డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లులను కూడా సంబంధిత మంత్రులు శాసన సభలో ప్రవేశ పెట్టనున్నారు.

ఇలా ఉండగా .... 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ శాఖల బడ్జెట్ కేటాయింపులకు శాసన సభ నిన్న ఆమోదం తెలిపింది. రోడ్లు ..., భవనాలు, పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి, జలవనరులు, ఇంధన, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, మత్స్య, పౌర సరఫరాలు, క్రీడ, రవాణా శాఖలకు కేటాయించిన పద్దుల వివరాలను సంబంధిత మంత్రులు సభలో ప్రవేశ పెట్టగా.... సభ్యులు వాటికి ఆమోదం తెలిపారు.

---------------------------

దేశ వ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలను అందించే లక్ష్యంతో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ .....ఇస్రో ... రూపొందించిన జి – శాట్ ఎన్–2 ఉపగ్రహం ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్పేస్.ఎక్స్ కు చెందిన ఫాల్కన్ – 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహ నింగిలోకి వెళ్లనున్నది. భారత కాలమానం ప్రకారం రేపు మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషాలకు ఈ ప్రయోగం జరగనున్నది.

అండమాన్ నికోబార్ ...., లక్ష ద్వీప్ వంటి ప్రాంతాలలోనూ ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ ప్రయోగ లక్ష్యం. అంతేకాకుండా ... జి – శాట్ ఎన్ –2 ఉపగ్రహం ద్వారా విమానాలలో వై ఫై సేవలు మరింత విస్తృతం కానున్నాయి. దాదాపు 4 వేల 7 వందల కిలోల బరువుగల ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకువెళ్లేందుకు ఇస్రోకు చెందిన ఎం – కె – 3 వాహక నౌకకు సాధ్యం కాదు. అందువల్ల .... భారత్ – అమెరికా అంతరిక్ష.ఒప్పందాల్లో భాగంగా స్పేస్ ఎక్స్ సంస్థతో కలిసి జి –శాట్ ఎన్ – 2 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు.

---------------------------

ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్పు కోసం ప్రభుత్వ వైద్యులు జారీ చేసే ధ్రువీకరణ పత్రాలను కూడా అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. మున్సిపల్ కమిషనర్లు ...., పంచాయతీ కార్యదర్శులు అందజేసే సర్టిఫికెట్ల మాదిరిగా ప్రభుత్వ ఆస్పత్రులు ఇచ్చే క్యూ ఆర్ కోడ్ పత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు గ్రామ ..., వార్డు సచివాలయ శాఖ అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

తన కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతలను రూపుమాపి .... ప్రజలను చైతన్యవంతులను చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు కనకదాసు జయంతిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. రేపు ఆయన జయంతి నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అనంతపురం పట్టణంలో రేపు రాష్ట్ర స్థాయిలో కనక దాసు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ..., మండల ..., గ్రామ స్థాయిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. కనక దాసు కన్నడ భాషలో నల చరిత్ర ..., హరి భక్త సార ..., నృసింహస్తవ ..., ...., మోహన తరంగిణి వంటి రచనలు చేశారు. ఈ రచనలు సమ సమాజ స్థాపన దిశగా అప్పట్లో ప్రజలను ఉత్తేజితులను చేశాయి.

---------------------------

కిశోరి బాలికల వికాసంతోనే సమాజ సౌభాగ్యం సాధ్యమవుతుందని అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న అన్నారు. అనంతపురంలో ఐసిడిఎస్ అధికారులతో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ సమాజ గతిని మార్చే శక్తి బాలికలకే సాధ్యమన్నారు. బాలికలు చెప్పేది విని ఆకళింపు చేసుకున్నప్పుడు, వారి అవసరాలు తీర్చగలిగినప్పుడు, వారి హక్కులు గుర్తించగలిగినప్పుడు బాలికలు తమ కుటుంబాన్నే కాదు.. యావత్

సమాజ గతిని మార్చగలరన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అమ్మాయిలను బలమైన, ధైర్యమైన, చురుకైన వారీగా ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు.

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం .... టి.టి.డి. పాలక మండలి ఎక్స్ అఫిషియో సభ్యునిగా టి.టి.డి. కార్యనిర్వహణాధికారి జె. శ్యామల రావు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమల ఆలయం బంగారు వాకిలి వద్ద ఆయన చేత అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి ఈ పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. ఇప్పటికే 25 మంది పాలక మండలి సభ్యులు ..., నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. టి.టి.డి. పాలక మండలి చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు అధ్యక్షతన తిరుమలలో రేపు మొదటి పాలక మండలి సమావేశం జరగనున్నది.

ఎక్స్ అఫిషియో సభ్యునిగా శ్యామల రావు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ .... తిరుమల సందర్శించే భక్తులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. గత అయిదు నెలలుగా తిరుమలలో అనేక సంస్కరణలు చేపట్టామని ..., తిరుమలలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల రాకుండా చూడడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం జరుపుకుంటున్నాం. 1939 సంవత్సరం నవంబరు 17వ తేదీన చెక్ రిపబ్లిక్ రాజధాని ప్రాగ్ నగరంలో తొమ్మిది మంది విద్యార్థులను ఎటువంటి విచారణ లేకుండా నాజీలు ఉరి తీశారు. వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం నవంబరు 17వ తేదీని ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవంగా పాటిస్తున్నారు.

---------------------------

తిరుపతి జిల్లా చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలు స్వగ్రామం నారావారిపల్లెలో ఈరోజు జరుగుతున్నాయి. అనారోగ్య కారణాలతో నిన్న మధ్యాహ్నం నారా రామ్మూర్తి నాయుడు హైదరాబాదులోని ఏఐజి ఆసుపత్రిలో మృతి చెందారు. ఈరోజు ఉదయం ప్రత్యేక విమానంలో పార్థివదేహాన్ని తీసుకువచ్చిన కుటుంబ సభ్యులు స్వగ్రామం నారావారిపల్లెలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. నారా రామ్మూర్తినాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోదరుడు. ఈ నేపథ్యంలో అంత్యక్రియలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు హాజరయ్యారు. మహారాష్ట్ర గవర్నర్ రాధాక్రిష్ణన్ రామ్మూర్తి నాయుడు పార్టీవ దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. చివరిసారిగా అశ్రునివాళి అర్పించేందుకు రాజకీయ, సినీరంగ ప్రముఖులు నారావారిపల్లికి చేరుకున్నారు.

---------------------------

07145 నెంబరు కలిగిన మచిలీపట్నం – కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలలకు బయల్దేరి మంగళవారం రాత్రి 9 గంటల 20 నిమిషాలకి కొల్లం చేరుతుంది. ఈ రైలు ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం నుంచి రైల్వే స్టేషన్ నుంచి బైయలుదేరి పెడన, గుడివాడ, విజయవాడ, కొత్త గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా కొల్లం చేరుతుంది. అలాగే 07146 నెంబరు కలిగిన కొల్లం – మచిలీపట్నం రైలు ఈ నెల

20, 27 తేదీల్లో బుధవారం 02 గంటల 30 నిమిషాల కొల్లంలో బయలుదేరి గురువారం ఉదయం 7 గంటల లకు ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం చేరుకుంటుంది.

ఈ ప్రత్యేక రైళ్లలో ఫస్ట్ ఏసీ, 2ఏసీ, 3ఏసీ స్లీపర్ క్లాస్ మరియు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

-------------------------

నైరుతీ బంగాళాఖాతం నుండి కొమరిన్ తీరం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఆంధ్ర ప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రభావంతో కోస్తా దిశగా తూర్పు గాలులు వీస్తున్నాయని ...., ఈ కారణంగా పలు జిల్లాలలో ఈ రోజు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

-------------------------

======================